యూరియాకు కృత్రిమ కొరత తప్పదా?


కాగుపాడు ఆయకట్టులో చేనుకు స్ప్రే చేస్తున్న రైతు


నారాయణపురం సొసైటీలో కాంప్లెక్స్ ఎరువులను తీసుకెళుతున్న రైతులు


సొసైటీ నుంచి ద్విచక్ర వాహనంపై ఎరువులను తీసుకెళుతున్న రైతు

- అవసరం కన్నా ఎక్కువగా నిల్వ చేసే యోచనలో రైతులు
- యూరియాకు పెరగనున్న డిమాండ్

ఉంగుటూరు: మండలంలోని యూరియా కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. పుష్కలంగా యూరియా ఉన్నపటికీ కొంత మంది రైతులు యూరియా దొరకదేమోనని ఇళ్లలో స్టాకు పెట్టే యోచన చేస్తున్నారు. ఈ మేరకు రైతులను వ్యవసాయ అధికారులు యూరియాపై చైతన్య పరుస్తున్నారు. కావాల్సిన యూరియా మాత్రమే తీసుకెళితే కొరత ఉండదని చెబుతున్నారు. అయినా రైతులు తొందర పాటు చర్యకు కృత్రిమ కొరత ఏర్పడే ప్రమాదంఉంది. కొంతమంది ప్రైవేట్ వ్యాపారులు కూడా యూరియా కొరత సృష్టించే యోచన లేక పోలేదు. జిల్లాలో ఉంగుటూరు ఎక్కువ విస్తీర్ణం వరి పండిస్తుంది. ఉంగుటూరు మండలంలో దాళ్వా పంట 23150 ఎకరాల్లో వేశారు. జిల్లాలో అన్ని మండలాల కన్నా ఎక్కువగానే వేశారు. కాంప్లెక్స్, ఇతర ఎరువులు పుష్కలంగానే అందుబాటులో ఉన్నాయి. పురుగుమందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికార్లు రైతులను చైతన్యపరుస్తున్నారు. అయినా ఎరువులు సరిపడా యూరియా బస్తాల కన్నా ఎక్కువ నిల్వ చేస్తున్నట్లు సమాచారం. దాళ్వా పంటకు నారాయణపురం సొసైటీ ద్వారా ఉన్న ఆరు పాయింట్ల నుంచి ఎరువులు రైతులుకు సరఫరా అవుతున్నాయి. బొమ్మిడి, బాదంపూడి సొసైటీల నుంచి రైతులకు సరఫరా చేస్తున్నారు. ఇవి కాకుండా ప్రైవేట్ వ్యాపారులు కూడా అమ్ముతున్నారు. ఇప్పటి వరకు మండలంలో 2000 టన్నుల యూరియాను రైతులు తీసుకెళ్లారు. అతిపెద్ద సొసైటీ అయిన నారాయణపురం సొసైటీ ద్వారా సుమారు 800 టన్నులు రైతులు యూరియా పట్టుకుపోయారు. ఇంకా 1000 టన్నులు అవసరంగా ఉంది. బొమ్మిడి, బాదంపూడి సొసైటీల్లో రైతులకు యూరియా మరో 1000 టన్నుల వరకు అవసరంగా ఉంది. ఈ నేపథ్యంలో నారాయణపురం సొసైటీ ద్వారానే యూరియా సరఫరా లేదని రైతులకు తెలియజేస్తున్నారు. అయితే డీఏపీ, 14-26-26, 14-35-14, 10-26-26, 20-20-013, 28-28-0 వంటి కాంప్లెక్స్ ఎరువులు రైతులకు బాగానే అందుతున్నాయి. మెట్ట ప్రాంతంలో కమర్షియల్ పంటలకు, దాళ్వా పంటలకు కాంప్లెక్స్ ఎరువులు బాగానే వాడుతున్నారు. మండలంలో ఎక్కడ చూసినా ఎరువులు వెదజల్లడం, పురుగు మందులు స్ప్రే చేయడం, సొసైటీలు, ఎరువుల దుకాణాల నుంచి ఎరువుల బస్తాలు తరలించడం వంటి దృశ్యాలే ఏ గ్రామం వెళ్లినా కనిపిస్తున్నాయి. పంట పొలాల వద్దనే రైతులు కాపలా ఉంటూ పంట పండించేందుకు శ్రద్ధ చూపుతున్నారు.

కొద్దిపాటి కొరత ఉంది



యూరియా కొరత కొంత ఉంది. అయితే కాంప్లెక్స్ ఎరువులకు ఎటువంటి కొరత లేదు. పుష్కలంగానే ఎరువులు దొరుకుతున్నాయి. ముందు చూపుగా కొందరు రైతులు యూరియా పట్టుకెళుతున్నారు. మాది నిడమర్రు మండలం బైనేపల్లి, నారాయణపురం సొసైటీ నుంచి పది సంవత్సరాలుగా ఎరువులు తీసుకెళ్లడం అలవాటు.

– ఓగిరాల నాగరాజు, రైతు, బైనేపల్లి

కృత్రిమ కొరతను అరికట్టాలి



నేను దాళ్వా ఊడ్చాను ఎరువులు కొరత ఎక్కడా కనిపించ లేదు. ప్రస్తుతానికి బాగానే దొరుకుతున్నాయి. అయితే సార్వా కన్నా దాళ్వాకు ఎక్కువ యూరియా వాడాల్సి వస్తుంది. సార్వాలో ఎకరాకు ఐదు బస్తాలు వాడితే, దాళ్వాలో ఎనిమిది బస్తాలు వాడాలి. వ్యవసాయాధికారులు ముందస్తు చర్యలు చేపట్టి, కృత్రిమ కొరతను అరికట్టాలి.

– ములకల త్రిమూర్తులు, రైతు, నీలాద్రిపురం

రైతులను చైతన్యపరుస్తున్నాం



ఎరువుల కొరత లేదు. ప్రధానంగా యూరియా కొరత లేదు. ఈ రోజుకి 700 టన్నుల యూరియా నిల్వ ఉంది. కృత్రిమ కొరత వచ్చే అవకాశం లేదు. ఈ మేరకు రైతులను చైతన్య పరుస్తున్నాం. . ఇప్పటివరకు రైతులకు సరిపోయే ఎరువులు ఉన్నాయి. వదంతులు విని కొందరు రైతులు కంగారు పడి స్టాకు పెట్టి ఉండొచ్చు.

– ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఏవో, ఉంగుటూరు

విద్యార్థులకు అవగాహన సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దెందులూరు: బాలికలు, మహిళలు ర్యాగింగ్ బారిన పడకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అభయపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం అందరికీ ఉపయోగకరమని వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ఏవో కరుణానిధి అన్నారు. దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీలోని వేగవరం హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో మంగళవారం ఏలూరు అభయ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, అభయ పోలీసుల విధులు తదితర వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభయ పోలీసులు మాట్లాడుతూ అపరిచిత లింకులను ఓపెన్ చేసి వారి ఫోన్ల ద్వారా నగదును పోగొట్టుకోవద్దన్నారు. నగదు కట్ అయితే వెంటనే 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. బాలికలు 112తో పాటు 950351100 నంబర్‌ను అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సీనియర్, జూనియర్ అని తేడా లేకుండా పోయిందని, స్నేహపూర్వకంగా మెలగాలని ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ లావణ్య, ఏవో కరుణానిధి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలీసులు అందిస్తున్న సేవలు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం అభయ అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు.

వరిలో సస్య రక్షణ చర్యలు పాటించాలి


వరి వేరును పరిశీలిస్తున్న ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, ఏవో

భీమడోలు: దాళ్వా పంటపై సల్ఫైడ్ గాయం (ఇంజురి) తీవ్ర ప్రభావం చూపుతున్నందున రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని ఏలూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ అన్నారు. పూళ్లలో సల్ఫైడ్ గాయం వలన మొక్క వేర్లు నల్లగా మారి గాలి బుడగలు, వాసనతో పంట దెబ్బతింటున్న వరి క్షేత్రాలను మంగళవారం భీమడోలు మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణితో కలిసి ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలందించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. రైతులు తక్షణమే పంట పొలాల్లో నీటిని పూర్తిగా తీసి వేయాలని, సీమనెర వచ్చేంత వరకు నేలను అరబెట్టి కొత్త నీటిని పెట్టాలని రైతులకు ఆయన సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు సల్ఫర్ ఎరువులను వాడొద్దన్నారు. రైతులు యూరియా, పొటాష్‌లను బూస్టర్ డోస్‌గా వాడాలన్నారు. మండల వ్యాప్తంగా రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. సాధారణంగా దాళ్వా పంటలో దమ్ముకు, నారుమడికి కొంత సమయం ఉండాలని, అయితే సాగు అలస్యమవుతుందని రైతులు వెంటనే ప్రారంభించడం వల్లే సల్ఫెడ్ గాయం సమస్య ఏర్పడుతుందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కోరారు. అయితే కొంత మంది రైతులు సల్ఫెడ్ గాయం సమస్యను తెగులుగా భావించి పురుగు మందులను యథేచ్ఛగా వినియోగిస్తున్నారన్నారు. దీని వలన పంటకు మరింత ముప్పు ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కొల్లి ఆదిత్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తేజో ఫణీంద్ర

ఉంగుటూరు: రోడ్డు ప్రమాదంలో వెన్నుముకకు గాయమైతే మంచానికి పరిమితమయ్యే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని వెన్నుముఖ నిపుణులు రాజమహేంద్రవరం వేద ఆసుపత్రి డాక్టర్ తేజో ఫణీంద్ర అన్నారు. మంగళవారం ఉంగుటూరు ఎన్‌హెచ్ఏఐ టోలుప్లాజా వద్ద రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వెన్నుముక, ఆర్థో సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి సేఫ్‌వే సంస్థ ప్రాజెక్ట్ మేనేజరు బాల సుబ్రహమణ్యం అధ్యక్షత వహించారు. డాక్టర్ తేజో ఫణీంద్ర మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. దేశంలో రోజుకి వెయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయని తద్వారా 500 మంది వరకు చనిపోతున్నట్లు లెక్కలు చెబుతున్నాయన్నారు. రోజువారీ కూలి నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరకు వెన్నుముక సమస్యతో బాధపడుతున్నారన్నారు. అనుభవం కలిగిన వెన్నుముక డాక్టరును కలవడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. శిబిరాన్ని డాక్టర్ తేజో ఫణీంద్ర ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 128 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో టోలు ప్లాజా మేనేజర్ ఎస్‌కే ఇంతియాజ్, సురేష్, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వేకు సహకరించాలి


గణపవరం: కుష్టు వ్యాధి సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


దెందులూరు: ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స అందిస్తే వ్యాధి నిర్మూలన సాధ్యమని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. మంగళవారం గణపవరం పీహెచ్‌సి పరిధిలో లెప్రసీ డిటెన్షన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకూ అన్ని హేబిటేషన్లలో ఇంటింటి సర్వే నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఇంట్లో కుటుంబ సభ్యులను పరిశీలిస్తామన్నారు. ఇంటో ఏ ఒక్కరు లేకపోయినా మరుసటి రోజు మళ్లీ ఆ గృహాన్నే సందర్శించి, మొత్తం సభ్యులకు పరీక్షలు చేస్తామన్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నా, శరీరంపై రాగి రంగు మచ్చలు, స్పర్శ, దురద లేని మచ్చలు ఉంటే కుష్టు అనుమానిత లక్షణాలుగా గుర్తించి, వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వారిని వైద్యుడి వద్దకు పంపి పరీక్షిస్తామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి.కిరణ్మయి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే ప్రారంభం

దెందులూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి కుష్టు వ్యాధి సర్వే ప్రారంభమైందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్నారు. మంగళవారం దోసపాడులో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి చేస్తున్న కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు యజమానులు ఇంట్లోని వ్యక్తులు వైద్య సిబ్బందికి సహకరించాలన్నారు. స్పర్శలేని రంగు మారిన మచ్చలు ఇతర లక్షణాలను సిబ్బంది తెలిజేస్తారన్నారు.

23 నుంచి ఆక్రమణల తొలగింపులు

ఉంగుటూరు: కోర్టు ఆదేశానుసారం ఈ నెల 23వ తేదీ నుంచి ఏలూరు గోదావరి కాలువలు, జాతీయ రహదారి వెంబడి ఉంగుటూరు మండలంలో 463 ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని ప్రత్యేక అధికారి పూర్ణచంద్ర శేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం నారాయణపురం సచివాలయంలో మండలంలో ఆక్రమణల తొలగింపుపై కార్యచరణ సమావేశం నిర్వహించారు. కైకరం, చేబ్రోలు, ఉంగటూరు, నారాయణపురం పంచాయతీ శాఖ, రివెన్యూ, ఇరిగేషన్, విద్యుత్, తదితర శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఈ విషయంలో అధికారులు ఎటువంటి సాకులు చెప్పినా, అలసత్వం వహించినా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అన్ని శాఖల అధికారులు 25 మంది తక్కువ కాకుండా మూడు టీమ్‌లుగా పనిచేయాలని సూచించారు. పోలీసులు, ఫస్ట్ ఎయిడ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. జేసీబీ డ్రైవర్లు, యజమానులు చైతన్యంగా పనిచేసే వాళ్లను పెట్టాలని సూచించారు. ఉద్యోగులు ఆక్రమణల తొలగింపులో పటిష్టంగా పని చేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ సూచించారు. సర్పంచి దిడ్ల అలకనంద గ్రామంలో ఆక్రమణల తొలగింపునకు మరి కొంత సమయం కావాలని అడిగినా మా వల్ల కాదని కోర్టు ద్వారానే అవుతుందని ప్రత్యేక అధికారి సమాధానం చెప్పారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం


సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా మున్సిపల్ కౌన్సిల్ పని చేస్తుందని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. మంగళవారం పట్టణంలోని 25వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడతూ జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులో గతంలో సాధారణ నిధుల నుంచి రూ.32 లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు ప్రారంభించారన్నారు. కానీ అప్పటి ఎన్నికల కారణంగా సీసీ రోడ్డు పనులు వాయిదా వేశారని, ఇప్పుడు ఆ రోడ్డు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొమ్మని వెంకటరమణ, కో-ఆపరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు బత్తిన చిన్న, గుబ్బల అబ్బాస్, గెద్దాడ శ్రీనివాసరావు, కంచుమర్తి ప్రకాష్, తల్లాడ శ్రీను, జహీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పడాల ట్రస్ట్ సేవలు అభినందనీయం


విద్యార్థినులకు ఆట వస్తువులు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

గణపవరం: పేద విద్యార్థుల చదువుకు, వారి ఉజ్వల భవిష్యత్తుకు పడాల ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వ్యాఖ్యానించారు. మంగళవారం గణపవరం బాలికోన్నత పాఠశాలలో పడాల ట్రస్ట్ సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు హెచ్‌ఎం బాల భాస్కరరావు అధ్యక్షత వహించారు. సభలో పడాల ట్రస్ట్ సీఈవో పడాల సూర్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదువుకుని, వారి భవిష్యత్తును వారే తీర్చిదిద్దుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ కె.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పడాల ట్రస్ట్ పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, వారి ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా ఇవ్వడం అభినందనీయమని ఈ సేవలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. సభలో వివేకానంద సేవా సమితి చైర్మన్ అల్లూరి గంగరాజు ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారులను కమ్మేసిన మంచు దుప్పటి


జాతీయ రహదారిపై లైట్ల వెలుతురులో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్


సూరప్పగూడెం వద్ద మంచు తెరలపై పచ్చని పంట పొలాలు

భీమడోలు: జాతీయ, రాష్ట్రీయ రహదారులు మంచు కప్పేసింది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో చలి పెరిగింది. తెల్లవారు జాము నుంచి మంగళవారం ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దట్టంగా కురిసింది. రోడ్ల పైకి రావాలంటే భయపడ్డారు. మండల వ్యాప్తంగా మంచు దుప్పటిలా కమ్మేసింది. దీనితో రహదారులపై వాహనాలు పగలు కూడా లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాయి. ఈ సీజన్‌లో ఇంతగా మంచు విపరీతంగా కురవడం ఇదే ప్రథమం. దీంతో వారి పనులకు తీవ్ర ఆటంకంగా మారింది. దూర ప్రాంతాలకు ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పచ్చని పంట పొలాలను సైతం మంచు చుట్టేసింది. జల్లులుగా కురుస్తున్న మంచులోనే రోజువారీ పనులకు కోసం రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, వాహనదారులు వెళుతున్నారు. దీంతో అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయని తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

అమ్మవారి ఉత్సవ పోస్టర్ల విడుదల


అమ్మవారి ఉత్సవాల పోస్టరును విడుదలచేసిన తపన చౌదరి

దెందులూరు: మండలంలోని గాలయగూడెంలో శ్రీఅచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాల పోస్టర్లను మంగళవారం కొవ్వలిలో ఆయన నివాసంలో గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) విడుదల చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.25 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అమ్మవారి ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ సభ్యులు గారపాటి చౌదరికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. దెందులూరు మండల బీజేపీ అధ్యక్షుడు ఎం.బుజ్జి గోపాల్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం వాయిదా

దెందులూరు: గోపన్నపాలెంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించాల్సిన దెందులూరు నియోజకవర్గం స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశారు. ఈ మేరకు స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ దెందులూరు నియోజకవర్గం సెక్రటరీ మేదనరావుపాలెం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రవిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారుల నుంచి తదుపరి స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహణపై ఆదేశాలు వచ్చిన తర్వాత సమాచారాన్ని నియోజవర్గంలో అన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలకు తెలియజేస్తామన్నారు.

స్థల పరిశీలన

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భవన నిర్మాణాలకు స్థల పరిశీలనను స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మంగళవారం చేపట్టారు. ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బందితో సమావేశమైన ఆయన వారితో ఈ విషయమై చర్చించారు.

పింఛన్ల తనిఖీ


పింఛన్‌దారుడిని ప్రశ్నిస్తున్న టీం అధికారులు

కొయ్యలగూడెం: ప్రభుత్వం అనారోగ్య లబ్ధిదారులకు ఇస్తున్న పింఛన్ల తనిఖీ మంగళవారం నిర్వహించినట్లు ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రెండు బృందాలుగా ఏర్పడిన అధికారులు మొత్తం 18 పంచాయతీల పరిధిలో ఉన్న పెన్షన్‌దారులను తనిఖీ చేసి వారి వద్ద నుంచి వివరాలు, ధ్రువీకరణ పత్రాలు సేకరించామన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా 47 ఏడు మంది అనారోగ్య పరిస్థితుల రీత్యా మంచానికి పరిమితమై ప్రతి నెలా రూ.15 వేల పింఛన్ పొందుతున్నారన్నారు. కొందరు నకిలీ ధ్రువీకరణ పత్రాలతో పింఛన్ పొందుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించినట్లుగా తెలిపారు. ఇదే విధంగా మిగిలిన పింఛన్‌దారులను కేటగిరీలుగా విభజించి వారివి కూడా పరిశీలిస్తామని తెలిపారు.

బకాయి వేతనాలను విడుదల చేయాలి


ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఐదు నెలల పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు మాట్లాడుతూ 18 నెలల పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐలను ఈ నెల 23వ తేదీ లోపు విడుదల చేయకపోతే 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. ఈ నెల 12వ తేదీన సమస్యలను వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి, ఏలూరు డీసీహెచ్ఎస్‌లకు తెలియజేశామని అన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వ వర్గాల నుంచి గాని, కాంట్రాక్టర్ నుంచి గాని ఎటువంటి స్పందన లేకపోవడం వలన నిరవధిక సమ్మెలోకి వెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పారిశుద్ధ్య విభాగం అధ్యక్షురాలు టి.మరియమ్మ, వెంకట్రావు, సునీత, రామకృష్ణ, వి.వాణి, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణపై డీఎస్పీ విచారణ

కామవరపుకోట: సంక్రాంతికి నిర్వహించిన కోడి పందేల్లో కామవరపుకోట మండలంలోని రామన్నపాలెం పంచాయతీ మారుతీనగర్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణపై జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర మంగళవారం విచారణ చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకొని ఘర్షణపై ఆరా తీశారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తడికలపూడి ఎస్సై చెన్నారావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.